షూటర్ ఇషాసింగ్‌కు ఘన సత్కారం



ఇషాకు చెక్ అందిస్తున్న జగన్‌మోహన్ రావు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఆసియా క్రీడల స్వర్ణ పతకధారి, అర్జున అవార్డు గ్రహీత, షూటర్ ఇషాసింగ్‌ను హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు ఘనంగా సత్కరించారు. కూకట్‌పల్లిలోని అక్షర ఇంటర్నేషనల్ స్కూల్‌లో జరిగిన వార్షికోత్సవాల్లో ఇషా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అక్షర విద్యాసంస్థల తరఫున ఇషాకు జగన్‌మోహన్ రావు రూ. లక్ష నగదు బహుమతిని చెక్ రూపంలో అందించారు. అనంతరం జగన్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతిభావంతులైన క్రీడాకారులకు కొదవ లేదని, అయితే వారికి సరైన దిశానిర్దేశం చేసే యంత్రాంగం కొరవడిందన్నారు. ప్రభుత్వాన్ని నిందించకుండా, హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న మల్టీ నేషనల్ కంపెనీలు, కార్పొరేట్ దిగ్గజాలు తెలంగాణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. ఈ అంశంపై త్వరలో మాజీ క్రీడాకారులు, క్రీడా నిపుణులతో ఒక రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నామని జగన్ చెప్పారు.



కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో కొలన్ హన్మంత్‌రెడ్డి

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

నిజాంపేట్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఆరు గ్యారెంటీలు అర్హులందరికీ అందేలా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి సూచించారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రగతినగర్ 22, 23 డివిజన్‌కు చెందిన పలువురు మహిళలు, యువకులు హన్మంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా హన్మంత్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ఏ ఒక్కటీ ప్రజలకు సరిగా అందలేదని ఆరోపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, కొలన్ రాజశేఖర్‌రెడ్డి, మున్సిపల్ కార్పొరేషన్ మహిళా అధ్యక్షురాలు, ఇందిరా, రమేష్, అరవింద్ పాల్గొన్నారు.

మంత్రి ప్రకటనపై పారిశ్రామిక వేత్తల హర్షం

బాలానగర్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): పరిశ్రమలకు సంబంధించిన పూర్తి నివేదికను ఇవ్వాలని అధికారులను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖా మంత్రి శ్రీధర్ బాబు ఆదేశించడం పట్ల బాలానగర్ కోఆపరేటివ్ ఇండస్ట్రీస్ సబ్‌లీజ్ దారులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం పరిశ్రమల భవన్‌లో అధికారులతో కలిసి నిర్వహించిన సమీక్షా సమావేశంలో రాష్ట్ర విభజనకు ముందు, తరువాత పరిశ్రమలకు కేటాయించిన భూములపై క్షేత్ర స్థాయిలో పరిశీలన చేయాలని ఆదేశాలు జారీ చేయడం వల్ల సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలకు ఎంతో లబ్ధి చేకూరుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. బాలానగర్ కోఆపరేటివ్ ఇండస్ట్రీస్ ఎస్టేట్‌లోని 47 ఎకరాల లీజు భూముల సర్వేలో తప్పులు దొర్లాయని, అధికారులు ఇష్టారీతిన సర్వే చేసి తప్పుడు నివేదికను ప్రభుత్వానికి అందజేశారని కొందరు సబ్‌లీజుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంత్రి శ్రీధర్‌బాబు ప్రకటనతో నైనా అధికారులు క్షేత్రస్థాయి పరిశీలనకు వచ్చి పరిశ్రమలు నడుపుతున్న వారి సమక్షంలో సమగ్ర సర్వే చేసి ప్రభుత్వానికి సరియైన నివేదిక అందజేయాలని వారు పరిశ్రమల శాఖ అధికారులను డిమాండ్ చేస్తున్నారు. 47 ఎకరాల ప్రభుత్వ లీజు భూముల్లో పరిశ్రమలు నడుపుకుంటున్న వారందరినీ ఒకే కేటగిరీగా పరిగణిస్తూ వారికి 100 శాతం పేమెంట్ కింద స్థలాలు రిజిస్ట్రేషన్ చేయాలని వారు మంత్రికి విజ్ఞప్తి చేశారు.



సీఐ నవీన్‌కుమార్‌తో కార్పొరేటర్లు రవీందర్‌రెడ్డి, సతీష్‌గౌడ్ తదితరులు

సీఐ నవీన్‌కుమార్‌కు శుభాకాంక్షలు

బాలానగర్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): బాలానగర్ పీఎస్ సీఐగా బాధ్యతలు చేపట్టిన పి.నవీన్‌కుమార్‌ను కార్పొరేటర్లు ఆదివారం కలిసి సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి, ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో...

కూకట్‌పల్లి కాంగ్రెస్ ఏ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్‌రెడ్డి, నాయకులు ఎడ్ల మోహన్‌రెడ్డి, ప్రసన్నకుమార్, నరేందర్, శివ, ప్రకాశ్ తదితరులు సీఐ నవీన్ కుమార్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



ర్యాలీగా వెళ్తున్న మేడ్చల్ మెట్రో సాధన సమితి సభ్యులు

మేడ్చల్ వరకు 'మెట్రో' లైన్ వేయాలి

పేట్‌బషీరాబాద్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ వరకు మెట్రో రైలు మార్గం వేయాలని డిమాండ్ చేస్తూ మేడ్చల్ మెట్రో సాధన సమితి ఆధ్వర్యంలో జీడిమెట్ల గ్రామంలోని ఎన్‌హెచ్-44 రహదారి పక్కన ఉన్న గాంధీ విగ్రహం వద్ద ఆదివారం నిరసన తెలిపారు. అనంతరం జీడిమెట్ల గ్రామం నుంచి సుచిత్రా చౌరస్తా వరకు బ్యానర్లు పట్టుకుని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మేడ్చల్ మెట్రో సాధన సమితి అధ్యక్షులు సంపత్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, సంజీవ రెడ్డి, వెంకటేశ్వర్లు, గిరిధర్ మాట్లాడారు. మెట్రో రైలు మార్గం మేడ్చల్ వరకు వేసే విధంగా సీఎం రేవంత్‌రెడ్డి చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. రెండో దశలో చేపట్టనున్న మెట్రో రైల్ ప్రాజెక్టులో మేడ్చల్ కొంపల్లి, అల్వాల్, బొల్లారం పరిసర ప్రాంతాల మీదుగా మెట్రో లైన్ వేసేవిధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఓల్డుబోయినపల్లి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): బోయినపల్లి 11 కేవీ ఫీడర్ పరిధిలో మరమ్మతు పనుల కారణంగా పలు ప్రాంతాలలో సోమవారం విద్యుత్ సరఫరా ఉండదని బోయినపల్లి సీటీడీ ఏడీఈ శ్రీనివాస్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ప్రశాంత్‌నగర్, రాజీవ్‌గాంధీనగర్, బీఎస్ఎన్ఎల్ ఆఫీస్, రాఘవేంద్ర ఆఫీస్ ఏరియాలో ఉదయం 10 నుంచి 2గంటల వరకు, ప్రశాంతినగర్ కాంటా, కోర్టు కాంప్లెక్స్, తదితర ప్రాంతాల పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు.



యాదాద్రిలోని శ్రీ లక్ష్మీనర్సింహస్వామిని ఆదివారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు దర్శించుకొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక వేద ఆశీర్వాదాలు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ శ్రావణ్‌కుమార్, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- కూకట్‌పల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి)

తాగునీరు వృథా

- మంజీరా పైపులైన్‌కు లీకేజీలు..
- గుంతల మయంగా రహదారి
- ప్రమాదాల బారిన వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



హుడాకాలనీ మంజీరా పైపులైన్ రోడ్డులో తాగునీటి లీకేజీలతో గుంతల మయంగా రహదారులు



మియాపూర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): తాగునీరు వృథాగా పోతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో నాలాగు కిలోమీటర్ల మేర మంజీరా పైపులైన్ లీకేజీలతో రోడ్లపై ప్రవహిస్తోంది. తాగునీటి వరద ప్రవాహానికి కోట్లు వెచ్చించి వేసిన రోడ్లు ధ్వంసమవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. వృథా అవుతున్న తాగునీటి సమస్యపై పలుమార్లు జలమండలి అధికారులకు కాలనీ వాసులు, వాహనదారులు ఫిర్యాదు చేసినా స్పందన కరువైంది.

శేరిలింగంపల్లి నియోజకవర్గం హఫీజ్‌పేట డివిజన్ చందానగర్ హుడాకాలనీ నుంచి హఫీజ్‌పేట ఫ్లైఓవర్ వరకు దాదాపు మూడు కిలోమీటర్ల మేర ముంబాయి జాతీయ రహదారికి సమాంతరంగా మంజీరా పైపులైన్ వేశారు. తాగునీటి లీకేజీతో గుంతలమయంగా మారిన ఈ రోడ్డుపై అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ సమస్య ఇలాగే కొనసాగితే వేసవిలో నీటి ఎద్దడి తప్పదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మదీనగూడ, వైశాలినగర్, ఆర్టీసీకాలనీ, హుడాకాలనీ, సప్తగిరి కాలనీ, ప్రకాశ్‌నగర్ కాలనీలకుఈ పైపులైన్ నుంచే తాగునీరు సరఫరా అవుతోంది. ఆయా కాలనీల్లో వందలాది అపార్టుమెంట్ వాసులు, గేటెడ్ కమ్యూనిటీవాసులు నివాసం ఉంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైపులైన్ల లీకేజీలను అరికట్టి, రోడ్లకు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

కేన్సర్‌పై అవగాహన పెంపొందించుకోవాలి



5కే రన్‌లో విద్యార్థులు, రామ్‌దేవ్‌రావు ఆస్పత్రి సిబ్బంది

కూకట్‌పల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కేన్సర్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకొని, నివారణ చర్యలను తప్పనిసరిగా పాటించాలని రామ్‌దేవ్‌రావు ఆస్పత్రి నిర్వాహకులు విక్రమ్‌దేవ్ రావు సూచించారు. ప్రపంచ కేన్సర్ దినోత్సవం పురస్కరించుకుని ఆదివారం కూకట్‌పల్లిలోని ఆస్పత్రి ప్రాంగణం నుంచి నిర్వహించిన 5కే రన్‌ను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. కేన్సర్ నివారణలో భాగంగా ఆస్పత్రిలో విధులు నిర్వహించే మహిళా సిబ్బందికి, ఆస్పత్రి దత్తత తీసుకొన్న 100మంది పేద విద్యార్థినులకు ఉచితంగా హెచ్‌పీవీ వ్యాక్సిన్ అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆస్పత్రి నిర్వాహకులు మీరా రావు, ప్రశాంత్‌రెడ్డి, అపర్ణరావు, డా.కమలాకర్, డా.యోబు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి



లులు మారథాన్ ప్రారంభోత్సవంలో డాక్టర్లు, మాల్ ఉన్నతాధికారులు

కేపీహెచ్‌బీకాలనీ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కేన్సర్ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉంటూ ముందస్తు టెస్టులు చేయించుకుంటే ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడవచ్చని హోలిస్టిక్ హాస్పిటల్ డాక్టర్లు ఆలూరి విజయలక్ష్మి, సమీరా సూచించారు. వరల్డ్ కేన్సర్ డే పురస్కరించుకొని కేపీహెచ్‌బీలోని లులు మాల్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన లులు మారథాన్ కార్యక్రమాన్ని డాక్టర్లు జెండా ఊపి ప్రారంభించారు. అంతకుముందు ఆరోగ్యం పట్ల ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. కేన్సర్‌పై ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు లులు మాల్ యాజమాన్యం తీసుకున్న నిర్ణయాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో లులు మాల్ రీజనల్ డైరెక్టర్ అబ్దుల్ సలీం హస్సాన్, ఆర్ఎం అబ్దుల్ ఖదీర్ షేక్, మాల్ మేనేజర్ ఎబిల్ అరసన్, హైపర్ మార్కెట్ ఆర్ఎం నౌషాద్ కిజక్కుప్పురత్ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని గెలిపించండి



సమావేశంలో డీకే అరుణ, హరీశ్‌రెడ్డి తదితరులు

ఓల్డుబోయినపల్లి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ పిలుపునిచ్చారు. ఆదివారం ఓల్డుబోయినపల్లి హస్మత్‌పేటలోని మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా బీజేపీ అటల్‌జీ భవన్‌లో జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీశ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కోర్‌కమిటీ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై బస్తీ చలో-గావ్‌చలో అభియాన్ కార్యక్రమాలపై చర్చించారు. పార్లమెంటు ఎన్నికల ప్రచారంపై పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం మోదీ 2024 బస్ ఎగ్జిబిషన్‌ను ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మధుసూదన్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, విక్రమ్ గౌడ్, సామ రంగారెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ ఆర్‌కే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కిందికుంట చెరువును అభివృద్ధి చేస్తాం : ఎమ్మెల్యే గాంధీ



ఎమ్మెల్యే గాంధీతో కిందికుంట చెరువు వాకర్స్ కమిటీ సభ్యులు

హైదర్‌నగర్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): కిందికుంట చెరువును అభివృద్ధి చేస్తామని, పార్కులో సదుపాయాలు కల్పిస్తామని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ తెలిపారు. హైదర్‌నగర్ కిందికుంట చెరువు వాకర్స్ కమిటీ సభ్యులు ఆదివారం ఎమ్మెల్యేను కలిసి సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పార్కును, వాకింగ్‌ట్రాక్‌ను మరింత అభివృద్ధి చేయాలని కోరారు. కార్యక్రమంలో వాకర్స్ కమిటీ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

'కేఎస్‌ఆర్ఎస్'లో సమస్యల పరిష్కారానికి కృషి

మియాపూర్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): కేఎస్‌ఆర్ఎస్ అపార్టుమెంట్‌లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. హఫీజ్‌పేట డివిజన్ పరిధిలోని కేఎస్‌ఆర్ఎస్ అపార్టుమెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఆత్మీయ సమావేశంలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ఎమ్మెల్యే గాంధీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మంచినీటి సమస్యను త్వరలో పరిష్కరిస్తామన్నారు. బిల్డర్ మౌలిక సదుపాయాలు కల్పించకుండా అపార్ట్‌మెంట్ వాసులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. అపార్ట్‌మెంట్‌వాసులకు అన్ని విధాలుగా అండగా ఉంటానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో హఫీజ్‌పేట డివిజన్ అధ్యక్షుడు బాలింగ్ గౌతమ్‌గౌడ్, అపార్టుమెంటు వాసులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 50 శాతానికి పెంచాలి



మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య, గుజ్జ కృష్ణ

బర్కత్‌పుర, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 50 శాతానికి పెంచాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను 22 శాతానికి కుదించిందని, దీంతో బీసీలకు తీరని అన్యాయం జరిగిందన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు గువ్వల భరత్‌తో కలిసి ఆదివారం సచివాలయంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశామని ఆర్.కృష్ణయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీరాజ్ సంస్థలలోని సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్‌పీటీసీ, చైర్మన్‌లు, వార్డు మెంబర్స్, కౌన్సిలర్స్, కార్పొరేటర్లలో బీసీల జనాభా దామాషా ప్రకారం 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తేనే న్యాయం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో స్థానిక సంస్థల రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతామని పేర్కొన్నారని, దానిని 50 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. కులగణన చేపట్టడానికి వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. బీసీల విద్య, ఉద్యోగ రంగాల రిజర్వేషన్లను 55 శాతానికి పెంచాలని, క్రిమిలేయర్‌ను పూర్తిగా రద్దు చేయాలని, ప్రస్తుతం 13 కార్పొరేషన్లతోపాటు మరో 40 బీసీ కులాల కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో బీసీ సంఘాల నేతలు గుజ్జ కృష్ణ, భరత్, నీల వెంకటేష్, గుజ్జ సత్యం, సి.రాజేందర్, రామకృష్ణ, మట్ట జయంతి, బలరాం, శివ, అరవింద్, రాకేష్, దత్త, జ్యోతి ఉన్నారు.

జూపార్కును సందర్శించిన కేరళ మంత్రి, టర్కీ కాన్సులేట్ జనరల్



టర్కీ కాన్సులేట్ జనరల్, కుటుంబ సభ్యులతో జూ అధికారులు

మదీన, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్ర మంత్రి జె.చించురాణి, టర్కీ కాన్సులేట్ జనరల్ ఒర్హాన్ యాల్మన్ ఒకన్ ఆదివారం వేర్వేరుగా జూపార్కును సందర్శించారు. క్యూరేటర్ డాక్టర్ సునీల్ ఎస్.హిరమెత్, జూ అధికారులు వారికి స్వాగతం పలికారు. జూపార్కులోని వివిధ విభాగాల పనితీరును వివరించారు. యానిమల్ ఎన్‌క్లోజర్లు, సఫారీ పార్కు, రెప్టైల్ హౌజ్‌తో పాటు జంతువులకు అందిస్తున్న వైద్య సేవలు, కొద్దిరోజులుగా చేపట్టిన రెస్క్యూ ఆపరేషన్ల గురించి వివరించారు. జూపార్కు నిర్వహణ బాగుందని కేరళ మంత్రి పేర్కొన్నారు. కేరళ, తెలంగాణ రాష్ట్రాల మధ్య జూపార్కుల్లోని జంతువుల మార్పిడి గురించి చర్చించారు. జూపార్కు నిర్వహణపై టర్కీ కాన్సులేట్ జనరల్ సంతృప్తి వ్యక్తం చేశారు.

చైన్ స్నాచింగ్

బాలానగర్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మహిళ మెడలోంచి పుస్తెల తాడును దుండగులు లాక్కుని పరారయ్యారు. బాలానగర్ పరిధి గుడెన్‌మెట్ ఏపీహెచ్‌బీ కాలనీలో ఎద్దుల శ్రీలత టైలరింగ్ షాపును నిర్వహిస్తోంది. శనివారం మధ్యాహ్నం గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు బైకుపై వచ్చి ఆమెను అడ్రస్ అడిగారు. తెలియది చెబుతుండగానే ఆమె మెడలో ఉన్న 4 తులాల బంగారు పుస్తెల తాడును తెంపుకుని బైకుపై పారిపోయారు. బాధితురాలు వెంటనే బాలానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

నక్సల్ ఉద్యమం లేకుంటే తెలంగాణ ఉద్యమం లేదు

- టీఎస్‌పీఎస్సీ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి

రవీంద్రభారతి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): నక్సల్ ఉద్యమం లేకుంటే తెలంగాణ ఉద్యమం లేదని టీఎస్‌పీఎస్సీ మాజీ చైర్మన్ ప్రొ.ఘంటా చక్రపాణి అన్నారు. తెలంగాణ సమాజంలో ఉన్న అసమానతల కారణంగానే యువత తిరుగుబావుటా ఎగురవేసిందన్నారు. మంగళారపు లక్ష్మణ్ రాసిన 'మాయని గాయాల నెత్తుటి చరిత్ర' (యదార్థ సంఘటనల సమాహారం) పుస్తక పరిచయ కార్యక్రమాన్ని రవీంద్రభారతి మినీహాల్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజలను విముక్తి చేసింది నక్సల్స్ ఉద్యమమనే నిజాన్ని సమాజానికి చెప్పాలన్నారు. కరీంనగర్‌తోపాటు మరిన్ని ప్రాంతాల చరిత్ర రాయాల్సిన అవసరముందన్నారు. మార్కెట్‌కు వచ్చిన రైతులను భూస్వాములు వేధించేవారని, కుల వివక్ష తీవ్రంగా ఉండటంతో హుస్నాబాద్ వంటి ప్రాంతాల్లో నక్సల్ ఉద్యమాలు జరిగాయన్నారు. ఆకలితో ఉన్న వారితోపాటు ఆకలిబాధ తెలిసిన ఎంతో మంది నక్సల్ ఉద్యమాల్లో పాల్గొన్నారన్నారు. చరిత్రలో జరిగిన విధ్వంసాన్ని ప్రజలకు తెలిపేందుకు తెలంగాణ సమాజంలో జరిగిన ఉద్యమాలపై ప్రత్యేక పుస్తకాలు రావాల్సిన అవసరముందన్నారు. తెలంగాణ నీటి వనరుల అభివృద్ధి కార్పొరేషన్ తొలి చైర్మన్ వి.ప్రకాష్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యమస్ఫూర్తిని చంపేశారని, మళ్లీ ఉద్యమస్ఫూర్తి రావాలన్నారు. ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ మాట్లాడుతూ తెలుగునాట జరిగిన నక్సల్ బరి ఉద్యమంలో ఉన్నత చదువులు చదువుకున్న ఎంతోమంది ప్రాణ త్యాగం చేశారన్నారు. మాయని గాయాల నెత్తుటి చరిత్ర వంటి పుస్తకాలు మరిన్ని రావాలన్నారు. తెలంగాణలో విప్లవం సృష్టించిన ఎంతోమంది మేధావుల గురించి సమాజానికి చెప్పాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్, రచయిత జాకీర్, పుస్తక రచయిత మంగళారపు లక్ష్మణ్, టీఎస్‌పీఎస్సీ మాజీ సభ్యుడు సి.విఠల్, రచయిత డా.తైదల అంజయ్య, సీనియర్ పాత్రికేయులు తులాయిల శ్రీనివాస్ పాల్గొన్నారు.



నూతన అధ్యక్ష, కార్యదర్శులను సన్మానించిన కాలనీ వాసులు

పద్మానగర్ ఫేస్-2 అధ్యక్షుడిగా శ్రీనివాస్

కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధి పద్మానగర్ ఫేస్-2లోని శివాలయంలో నిర్వహించిన కాలనీ సంక్షేమ సంఘ ఎన్నికల్లో అధ్యక్షుడిగా దేవరకొండ శ్రీనివాస్ 6 ఓట్ల తేడాతో ఆదివారం గెలుపొందారు. అధ్యక్ష పదవి కోసం నలుగురు అభ్యర్థులు శ్రీనివాస్, భాస్కర్‌రాజు, హనుమంతు, రవికుమార్ యాదవ్ పోటీ పడ్డారు. కాలనీలో మొత్తం పోలైన 103 ఓట్లలో శ్రీనివాస్‌కు 46 ఓట్లు, హనుమంతుకు 40 ఓట్లు, భాస్కర్‌రాజుకు 17 ఓట్లు పోలయ్యాయి. రవికుమార్ యాదవ్‌కు ఒక్క ఓటు కూడా రాలేదు. కనీసం అతని ఓటైనా అతనికి వేసుకోకపోవడం ఇక్కడ విశేషం. దీంతో అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీనివాస్‌ను, ప్రధాన కార్యదర్శి బుచ్చిరెడ్డిని కాలనీ వాసులు శాలువాలు కప్పి, పూలమాలు వేసి సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. కాలనీలో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని నూతన అధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు.

అవంతినగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు



అధ్యక్షుడు వెంకటేశ్వర్లుకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న సంఘం సభ్యులు

అల్లాపూర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): అవంతినగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. మూసాపేట్ డివిజన్ అవంతి నగర్ సంక్షేమ సంఘానికి ఆదివారం ఎన్నికలు జరిగాయి. ఈ సంక్షేమ సంఘంలో మొత్తం 332మంది సభ్యులు ఉన్నారు. అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికల్లో వెంకటేశ్వర్లు మొత్తం 173 ఓట్లు సాధించి సమీప ప్రత్యర్థి గోపాల్ చౌదరిపై 16 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో సమస్యల పరిష్కారాని కృషి చేస్తానని, స్థానికులుకు నిరంతరమూ అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

పేట్‌బషీరాబాద్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డినగర్ డివిజన్ గాంధీనగర్‌లో పరిమిత ఉమెన్స్ అండ్ కిడ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కమ్యూనిటీహాల్‌లో నిర్వహించిన వైద్య శిబిరంలో దాదాపు 200 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి, అసరమైనవారికి మందులను అందజేశామని వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు అవిన, శ్రావణి, స్వామి వివేకానంద యూత్ అధ్యక్షుడు లక్ష్మీనాద్, సభ్యులు నర్సింహ, భిక్షపతి, తిమ్మయ్య, శ్రీకాంత్, సాయికిరణ్ పాల్గొన్నారు.

ఎండు గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

పటాన్‌చెరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నుంచి మహారాష్ట్రకు కారులో తరలిస్తున్న ఎండుగంజాయిని మెదక్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, పటాన్‌చెరు ఎక్సైజ్ సిబ్బంది ఆదివారం తెల్లవారుజామున సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో పట్టుకున్నారు. మెదక్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ రఘురాం తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు పట్టణ శివారులోని టోల్‌ప్లాజా వద్ద ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తుండగా గంజాయి తరలిస్తున్న కారు పట్టుపడింది. నల్గొండ జిల్లా చందంపేట మండలం బొల్లారం పట్టి గ్రామానికి చెందిన రమావత్ రాకేష్‌చంద్ర తన కారులో రూ.12లక్షల విలువైన 84కిలోల ఎండుగంజాయి ప్యాకెట్లను తరలిస్తున్న క్రమంలో ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించామని తెలిపారు.